


౨

## గత సంచికనుంచి కొనసాగింపు

**జరిగిన జగన్నాటకం**

**అందరూ ప్రముఖంగా ఎడమచేతిని వాడే సవ్యలంకలో కుడి చేతిని వాడినందుకు బోసుకు మరణదండన విధించబోయాడు దళాధిపతి. ఆచార్య వేదాంతం, ద్వీప, పశుపాల కలిసి బోసుని కాపాడారు. జలపతి సహాయంతో ఆ ద్వీపాన్ని దాటాలని ప్రయత్నించాడు బోసు. బోసే భవిష్యజ్ఞాన గ్రంధంలో చెప్పబడిన మహాబసు అని ద్వీప చెప్పింది. దాడి చేసిన దళాధిపతి సైనికులను ఉగ్ర సహాయంతో ఎదిరించాడు బోసు. ఆ పోరాటంలో జలపతి మరణించాడు.**

"నేను ఒప్పుకోను" అంటూ అరిచాడు ఉగ్ర. ద్వీప, పశుపాల అతని వైపు కోపంగా చూశారు.

"ఎందుకు ఒప్పుకోవు?" నిలదీసింది ద్వీప.

"అతను ఎవరో తెలియదు. ఇక్కడికి ఎలా వచ్చాడో, ఎందుకు వచ్చాడో తెలియదు. అలాంటివాడిని నాయకుణ్ణి చేయటంలో అర్థమే లేదు" అంటూ కోపంగా పిడికిలి బిగించి తన తొడ మీద తనే కొట్టుకున్నాడు.

జలపతి అంతిమ ఘడియల్లో వున్నప్పుడు బోసు "పోరాడతాను" అన్న మాటతో ఆయన తృప్తిగా కన్నుమూశాడు. బోసు మహాబసుగా మారిన క్షణమదే. అయితే ఉగ్ర అందుకు అంగీకరించపోవడంతో ఆ విషయం చర్చకు వచ్చింది.

"మన భవిష్యగ్రంధంలో చెప్పినది నిజమే అయితే, మనల్ని కాపాడబోయేది మన తరఫున యుద్ధం చెయ్యబోయేది మన ద్వీపవాసి కాదని మర్చిపోయావా ఉగ్రా?" అన్నాడు పశుపాల.

"లేదు. ఒక పరదేశీయుడు మనల్ని ముందుకు నడిపిస్తాడని నాకు కూడా తెలుసు. కానీ అది ఇతనే అని నమ్మకం కావాలి. ఒకవేళ అది ఇతను కాకపోతే? సగం పోరాటం తరువాత తన దేశానికి వెళ్ళిపోతానని అంటే? అప్పుడు మనం ఏమైపోతాం? మళ్ళీ మరో మహాబసు – అసలైన మహాబసు వస్తాడని ఎదురుచూస్తూ వుందామా?" వెటకారంగా అడిగాడు.

"అసలు ఇతను మహాబసు కాదని నీకెందుకు అనిపిస్తోంది?" అడిగింది ద్వీప.

"భవిష్యగ్రంధంలో వున్న వర్ణన గుర్తులేదా? అతని ఆజానుబాహుడై వుండాలి. అస్త్రప్రయోగంలో ప్రావీణ్యం వుండాలి. మనలో ఒకడిలా కలిసిపోవాలి. తన తోటివారిని కన్నబిడ్డల్లా చూసుకునే ఔదార్యం వుండాలి. వున్నాయా ఇవన్నీ మీరు అనుకుంటున్న ఈ మహాబసులో?" ప్రశ్నించడంలోనే తిరస్కారం ప్రదర్శించాడు ఉగ్ర. పశుపాల ముందుకు వచ్చాడు.

"నువ్వు అడిగే ప్రశ్నలకి సమాధానం చెప్పడం అసాధ్యం ఉగ్రా! ఒక వేళ ఇతనే మహాబసు అయితే, మనం ఇలా గుర్తించడంలో విఫలమైతే, భావి తరాలకు ఎంతో అన్యాయం చేసినవాళ్ళమౌతాము" అన్నాడు

"అందుకని? ఎవరో తెలియని అనామకుడిని పిలిచి నాయకత్వాన్ని చేతిలో పెట్టమంటావా?" ఉగ్ర అంతకంతకీ ఉగ్రుడైపోతున్నాడు. ఇంకా ఏదో అనబోయిన ఉగ్ర అప్పుడే అక్కడికి అడుగుపెట్టిన బోసుని చూసి ఆగిపోయాడు.

"ఏమిటి ఉగ్రా? నన్ను మీలో కలుపుకోవాలా వద్దా అని చర్చిస్తున్నట్లున్నారు?" అన్నాడు బోసు నవ్వుతూ. ఉగ్ర సమాధానం చెప్పలేదు. బోసు నడుచుకుంటూ అతనికి దగ్గరగా నడిచాడు.

"చూడండి. జలపతి నా ప్రాణాలను కాపాడాలని ప్రయత్నించాడు. నేను పోరాడతానని అతనికి మాట ఇచ్చాను. ఇంకో సందర్భంలో ఆచార్య వేదాంతం, ఈ ద్వీప నా ప్రాణాలను కాపాడారు. అలాగే నేను ఈ రోజు బ్రతికి వున్నానంటే అందుకు నీ సహాయం కూడా తోడ్పడింది ఉగ్రా! మీ అందరికీ నేను రుణపడి వున్నాను. ఆ రుణం తీర్చుకోడానికి మహాబసుగా మారటమే మార్గమని జలపతి నమ్మాడు. ప్రాణాలు పోతున్న ఆఖరు క్షణంలో కూడా అతను కోరుకున్నది అదే. అందుకే ఒప్పుకున్నాను." అన్నాడు బోసు.

"పోరాటానికి ఆశయం ఆధారం కావాలి కానీ ఎవరికో ఇచ్చిన మాట కాదు. అది నీకు బాధ్యతనైతే ఇస్తుంది కానీ బలాన్ని ఇవ్వదు" ఉగ్ర నెమ్మదిగానే అన్నాడు.

"నేను జలపతికి ఇచ్చిన మాట నా బాధ్యత మాత్రమే కాదు, నాకు స్ఫూర్తి కూడా. అయినా నన్ను మీలో కలుపుకోవాలా వద్దా అని మీరెందుకు చర్చిస్తున్నారు. పోరాడాలని నిశ్చయించుకున్న తరువాత పోరాడటం ఖాయం. అది మీతో కలిసి చేస్తానా లేక విడిగానా అన్నది నేనే నిర్ణయించుకోగలను. మీకు అభ్యంతరం అయితే చెప్పండి..."

"అభ్యంతరమేమీ లేదు మహాబసు..." ద్వీప. బోసు ఆమెను మధ్యలోనే ఆపాడు.

"అభ్యంతరం నీ వైపునుంచి కాదు ద్వీపా! ఉగ్ర వైపు నుంచి వినిపిస్తోంది... ఏమంటావ్ ఉగ్రా?"

"ఎవరో అనామకుణ్ణి తెచ్చి నాయకుణ్ణి చెయ్యడానికి దళం అంగీకరించదు..." ఉగ్ర చూపులు నేలమీద నిలిపి ఆలోచనగా అన్నాడు.

"సమస్య దళం అంగీకారమా? నా అనామకత్వమా? లేకపోతే నాయకుడు ఎవరు అన్నదే సమస్యా?" అడిగాడు బోసు.

"అంటే?"

"ఇప్పటిదాకా నాయకుడిగా నీకు వున్న అధికారాలని నాకు ఇవ్వాల్సి వస్తుందని కాదంటున్నావని నాకనిపిస్తోంది" బోసు చాలా మామూలుగా అన్నా ఆ మాట అక్కడ ఒక విస్ఫోటనంలా వినిపించింది. పశుపాలకి, ద్వీపకి కూడా ఆ విషయంపైన అనుమానం వుంది కానీ, బోసు ఆ విషయాన్ని ఇంత స్పష్టంగా, సూటిగా అడిగేసరికి ఉలిక్కిపడ్డారు. ఉగ్ర ప్రతిస్పందన ఎలా వుంటుందో అని భయపడ్డారు.

ఉగ్ర కళ్ళు ఎర్రబడ్డాయి. పళ్ళు పటపట కొరికాడు. కూర్చున్న చోటు నుంచి లేచి నడుచుకుంటూ వచ్చి బోసు దగ్గర నిలబడ్డాడు. ఇద్దరి చూపులు కలుసుకున్నాయి. కొన్ని క్షణాలు అలాగే నిలబడిపోయారు. అలా చూస్తుంటే వాళ్ళిద్దరూ ఊరికే నిలబడి ఒకరి కళ్ళలోకి ఒకళ్ళు చూసుకుంటున్నట్లు లేదు. ఆ ఇద్దరి మధ్య ఏదో మౌన సంభాషణ జరుగుతున్నట్లు అనిపించింది. అరనిముషం ఆ గదిలో మౌనం తాండవించింది.

"నాకు అంగీకారమే" అన్నాడు ఉగ్ర. దూరంగా నిలబడి జరుగుతున్నదంతా చూస్తున్న ఉగ్ర అనుచరుడు సుధామకి ఇదంతా మాయలా వుంది. అతను కూడా బోసే మహాబసు అని నమ్మినవాడు కాబట్టి సంతోషించాడు. ఉగ్ర అక్కడ్నుంచి కదలబోతుంటే ద్వీప ఆపింది.

"ఎందుకు మనసు మార్చుకున్నావు" సూటిగా అడిగింది. ఉగ్ర నవ్వి మళ్ళీ బోసు వైపు చూశాడు.

"అతను కళ్ళతోటే ప్రశ్నిస్తున్నాడు. ఒకవైపు అధికారానికి వ్యతిరేకంగా పోరాడుతూ, మరోవైపు ఆ పోరాటంలోనే అధికారంకోసం వెంపర్లాడటం హాస్యాస్పదంగా లేదా అని అడిగాడు. నేను కాదనలేని సత్యమది. అందుకే తప్పుకుంటున్నాను. అయితే బోసే మహాబసు అని మాత్రం ఒప్పుకోవట్లేదు. కాలం ఆ విషయాన్ని నిరూపించిన రోజు ఒప్పుకుంటాను" అన్నాడు.

మహాబసు ఆనందంగా ముందుకు వచ్చి, ఉగ్ర కుడి చేతిని తన కుడి చేతితో పట్టుకున్నాడు.

"చెప్పు మహాబసు. ఏం చేద్దాం?" అడిగాడు.

"ఏదైనా చెయ్యడానికి ముందు నేను కొన్ని విషయాలు తెలుసుకోవాలి. నాకు ఈ దేశ చరిత్ర తెలియాలి. ముఖ్యంగా ఈ ఎడమచేతి వాటం వెనుక వున్న చరిత్ర  అర్థం కావాలి. ఇక్కడ వుండే వ్యవస్థలు, వాటి పనితీరు తెలుసుకోవాలి. ఇవన్నీ చెప్పగలిగినవాళ్ళు ఎవరైనా వున్నారా?" అడిగాడు మహాబసు.

"మీరు అతన్ని ఇంతముందే కలిశారు మహాబసు. అతనే ఆచార్య వేదాంతం" చెప్పింది ద్వీప.

★★★

మర్నాడు ఆచార్య వేదాంతం, ఉగ్ర, ద్వీప, పశుపాల అంతా మహాబసు దగ్గర సమావేశమయ్యారు.

"సవ్యలంక చరిత్ర తెలుసుకోవాలని అడిగారు" ఆచార్య వేదాంతంతో చెప్పింది ద్వీప.

"చెప్పు మహాబసు! ఏం తెలుసుకోవాలనుకుంటున్నావు?" వేదాంతం తన గడ్డాన్ని నెమురుకుంటూ ప్రశ్నించాడు.

మహాబసు ఏం సమాధానం చెప్పాలా అన్నట్లు రెండు క్షణాలు మౌనంగా వుండిపోయాడు.

"ఆచార్యా! నేను వచ్చిన దగ్గర్నుంచి గమనిస్తున్నాను. ఇక్కడి మనుషుల్లో ఎడమచేతిని వాడుతున్నవాళ్ళు స్వభావికంగా వాడుతున్నట్లుగా లేదు. పుట్టుకతో అందరూ ఎడమచేతివాటం వాళ్ళే అయితే అలాగే కొనసాగడంలో తప్పులేదు. కానీ ఇదంతా కేవలం బలవంతం వల్లో, భయం వల్లో జరుగుతోందని నాకు అనిపించింది. దీనంతటికీ మూలం ఎక్కడుంది? చెప్పండి" అన్నాడు.

ఆచార్య వేదాంతం సాలోచనగా తల ఊపాడు.

"మూలాలు వెతకడం అంత సులభం కాదు మహాబసూ. చరిత్ర పుటల్లో ఎన్నో రహస్యాలు దాగి వుంటాయి. కొన్ని వాస్తవాలు అపోహల ముసుగులో వుంటాయి. నిజం అనే నిప్పు కనపడకుండా ఊహలు, కుట్రలు, అనుమానాలు అనే పరదాలు కప్పేసి వుంటాయి.

వాటిని తొలగించాలంటే అవి వున్నాయన్న స్పృహ ముందు కలగాలి. ఆ తరువాత వాస్తవం కనిపించేదాకా పరదాలను తొలగించే శక్తి కావాలి. నీ ప్రశ్నలోనే అవి కనపడుతున్నాయి. అందుకు సంతోషం కలుగుతున్నా, ఆ నిజం దాకా నువ్వు చేరుకోగలవా అన్న అనుమానం నాకు కలుగుతోంది..." అంటూ ఒక్క క్షణం ఆగాడాయన. ఆయన చెప్పే విషయాన్ని శ్రద్ధగా వింటున్న మహాబసును, ద్వీపను ఇతరులను ఒకసారి పరికించి మళ్ళీ కొనసాగించాడు.

"అందరూ ఎడమ చేతినే ముఖ్యమైన చేతిగా ఉపయోగించాలన్నది రాజశాసనం. ఈ ద్వీపానికి అధిపతి మహాధినేత అని పిలువబడే వామదేవుడు. ఆయనకు కనీసం పది తరాల ముందు నుంచి ఇదే శాసనం నడుస్తోంది. అంతకు ముందు ఈ శాసనం వుందా లేదా అన్నది ఎవరికీ తెలియదు. ఈ శాసనానికి ఈ ద్వీపంలో అందరూ అవలంబించే శాస్త్రగ్రంథం ఆధారం. శాస్త్రగ్రంథం ఇక్కడ మతాచారాలకు, దైవ కార్యాలకు, మహాధినేత ఆధిపత్యానికి మూలమైన గ్రంథం. ప్రాకృత భాషలో వున్న ఆ గ్రంథాన్ని చదివి అందులోని విషయాలను విడమర్చి చెప్పే బాధ్యత పవిత్రదేవాలయాలలో వుండే మతాధిపతులది. వారి వాక్కు దైవ వాక్కుగా చెప్పబడింది. వాళ్ళు ఆ గ్రంథం ద్వారా తెలుసుకున్న విషయాలనే మహాధినేతలు శాసనాలుగా ప్రకటించారు" చెప్పాడు వేదాంతం

"అంటే ఎడమచేతినే ముఖ్యమనదిగా వాడమని చెప్పింది ఈ మతాధిపతులేనంటారా?" అడిగాడు మహాబసు. ఉగ్ర గట్టిగా నవ్వాడు.

"నాకు తెలుసు మహాబసూ, నువ్వు వేదాంతం చెప్పిన కథ విన్న తరువాత ఈ మతాధిపతులు చేస్తున్న మోసాన్ని, ప్రజలను వాళ్ళు వేధిస్తున్న విషయాన్ని ఇట్టే తెలుసుకుంటావని నేను ముందే ఊహించాను. నీకో విషయం చెప్పనా... మేము చేసే పోరాటంలో మాకు మొదటి శత్రువులు ఈ మతాధిపతులే. నా అనుచరణగణం మొత్తానికి, ఎక్కడ మతాధిపతులు కనపడితే అక్కడే వాళ్ళని నరికేయమని ఉత్తర్వులు ఇచ్చాను" అన్నాడు గర్వంగా.

మహాబసు ఒక్క నిముషం మౌనంగా వుండిపోయాడు. అతను ద్వీపానికి వచ్చిన మొదటిరోజు గుడిలోకి వెళ్ళినప్పటి సంగతి జ్ఞాపకం వచ్చింది. అక్కడ తను కుడి చేతిని వాడినప్పుడు భయంతో కంపించిపోయిన పూజారులు గుర్తుకొచ్చారు. "స్వామీ... మిమ్మల్ని వేడుకుంటున్నాము. మమ్మల్ని ఏమీ చేయకండి. పిల్లలు కలవాళ్ళం" అంటూ వేడుకున్న మతాధికారి గుర్తుకొచ్చాడు. భయంతో బిగుసుకుపోయి ఏడుగ్గురు పూజారులు గుడి గోడకి ఆనుకోని వణికిపోతూ నిలబడటం గుర్తుకొచ్చింది.

"నేను మొదటిసారి గుడిలోకి వెళ్ళినప్పుడు అక్కడ వున్న మతాధికారులు నేను కుడిచేతిని వాడటం చూసి గడగడా వణికిపోయారు. అప్పుడు ఎందుకో అర్థం కాలేదు" అన్నాడు ఆలోచనలో నుంచి తేరుకుంటూ. ఉగ్ర మళ్ళీ నవ్వాడు.

"నువ్వు అంత ధైర్యంగా కుడిచేతిని వాడటం చూసి మాలో ఒకడివని భయపడిపోయి వుంటారు నీచులు" అన్నాడు నవ్వుతూనే.

"మహాధినేత కూడా ధిక్కరించలేని శాసనం చేయగలిగిన వాళ్ళైతే ఆ మతాధికారులు అంత భయపడుతూ బతకాల్సిన పనేముంది?" అన్నాడు.

ఆ ప్రశ్నకు సమాధానం ఎలా చెప్పాలో అర్థం కాలేదు ఉగ్రకు. వేదాంతం వైపు చూశాడు.

"అది ప్రాణభయం కదా మహాబసూ... ప్రాణమే పోతుందని తెలిసినప్పుడు అధికారాలకన్నా అర్థింపే ముందు గుర్తుకువస్తుంది" వేదాంతం చెప్పిన మాట విన్నా ఒప్పుకోలేదు మహాబసు.

“మతాధికారులు శాస్త్రగ్రంధాల ఆధారంగా ఒక విధానాన్ని ప్రవేశపెట్టినప్పుడు దానికి, ఆ శాస్త్రగ్రంధాన్ని అవలంబించే సర్వజనుల ఆమోదం వుండాలి కదా? వాళ్ళు చెప్పినట్లే అందరూ నడుచుకుంటారు కదా? అలాంటప్పుడు సైన్యంతో పనేముంటుంది?” అడిగాడు.

ఈసారి సమాధానం చెప్పడానికి వేదాంతం కూడా తడబడ్డాడు. ద్వీప నోరు విప్పింది.

“నువ్వు చెప్తున్నది నిజమే మహాబసూ… ఎడమ చేతిని వాడకపోతే శిక్ష పడుతుందన్న భయం ప్రజలలో ఎడమ చేతిని వాడేలా చేస్తోంది కానీ, మతమూ, మతాధిపతి, శాస్త్రగ్రంధమూ వంటి వాటి మీద వున్న భక్తి కాదు” అంది.

“అంటే ఇక్కడ జరుగుతున్నదానికి కారణం మతాధికారం కాదు, రాజ్యాధికారం అన్నమాట” అన్నాడు మహాబసు. వేదాంతం ఆశ్చర్యంగా చూశాడు. ఉగ్రకి ఆ వాదన ఎక్కడికి దారితీస్తోందో అర్థం కాలేదు.

“నువ్వు చెప్తున్నది నాకు అర్థం కావటంలేదు మహాబసూ” అన్నాడు ఉగ్ర.

“ఉగ్రా… ప్రజల నియమావళిని నిర్దేశించడానికి రెండు ముఖ్యమైన ప్రేరకాలు వుంటాయి. ఒకటి అలా ప్రవర్తించడం వల్ల వచ్చే లాభము, రెండు అలా ప్రవర్తించకపోవటం వల్ల వచ్చే నష్టమూ. ఈ లాభ నష్టాలను రెండు రకాల అధికారాలు నిర్దేశిస్తాయి. మతం ఫలానా రకంగా ప్రవర్తించడం వల్ల నీకు శాంతి, సౌభాగ్యం, ఇహపర లోక సుఖాలు దక్కుతాయని చెప్తుంది. శిక్ష ప్రత్యక్షంగా కాక మరో రూపంలోనో, మరో జన్మలోనో వస్తుందని చెప్తుంది. అది నమ్మినవాళ్ళను వేరే ఏ శక్తి మార్చలేదు. ఆ శాస్త్రగ్రంధాన్ని ఇచ్చికంగానే పాటిస్తారు. వారి ప్రవర్తనపైన వారికి స్వయం నియంత్రణ వుంటుంది. రెండో రకం అధికారం రాజ్యాధికారం. ఇది ప్రత్యక్షంగా శిక్షలు విధిస్తుంది. సమాజం లేదా రాజ్యం ఒక మనిషి ఎలా ప్రవర్తించాలని కోరుకుంటుందో అలా ప్రవర్తించకపోతే శిక్ష వేస్తానని అంటుందది. ఇది భయపెడుతుంది. భయంతోనే తమకు కావాల్సిన విధంగా సమాజంలోని మనుషులు ప్రవర్తించేలా చేస్తుంది.

ఉదాహరణకు ఒక మనిషిని హత్య చేయడం గురించి చెప్తాను. మతం జీవ హింస పాపమనీ, ప్రాణం పోసే శక్తి లేనప్పుడు ప్రాణం తీసే హక్కులేదని చెప్తుంది. అలా కాదని ప్రాణం తీసినవాళ్ళకి ఇహలోకంలో బాధ, పశ్చాత్తాపం, పరలోకంలో ఘోరమైన శిక్షలు వుంటాయని చెప్తుంది. దేవుడు క్షమించడని చెప్తుంది. ఇది సమాజం నమ్మితే ఇక ఆ సమాజంలో హత్యలు జరగవు. కానీ ఈ నమ్మకం ఏ కొంచెం కదిలినా అక్కడ హత్య అనే పాపం చేసేందుకు మనిషి సిద్ధమౌతాడు. అలాంటప్పుడు రాజ్యాధికారం వున్నవాడు హత్యకు మరణశిక్ష విధిస్తానని అంటే ఏం జరుగుతుంది? జనం భయపడతారు. ప్రాణం తీస్తే ప్రాణం పోతుందన్న భయం వాళ్ళని అలా చెయ్యనివ్వకుండా నియంత్రిస్తుంది. ఈ రెండింటికి తేడా తెలుసుకోలేకపోతే ఈ ప్రజలను ఇలా నడిపిస్తున్నదెవరో అర్థం చేసుకోలేము” అని ఆపి వేదాంతం వైపు చూశాడు. ఆయన ముఖంలో చిరునవ్వు, అతని వాదనతో ఏకీభవిస్తున్నట్లు కనపడింది.

“అయితే ఏమంటావు?” అన్నాడు ఉగ్ర.

“మతానికి, శాస్త్రానికి, ధర్మానికి కట్టుబడిన సమాజానికి సైనికుల అవసరమే వుండదు. ఇంత మంది సైనికులు శాసనాలను పరిరక్షించడానికి వున్నారంటే ఈ సమాజం ఆ శాసనాలను అంగీకరించడంలేదని అర్థం. మతపరమైన, శాస్త్ర సమ్మతమైన నియమాలను నమ్మడంలేదని అర్థం. అంటే మతాధికారులకు ఇక్కడ విలువ లేదు. వాళ్ళని ఎవరూ నమ్మడంలేదు”

“నువ్వు చెప్పింది తప్పు మహాబసూ… ఈ ద్వీపంలో అందరికన్నా అత్యధిక శక్తిమంతుడు మతాధికారే” వాదించాడు ఉగ్ర

“అది నీ భ్రమ ఉగ్రా… మతాధికారం ఒకప్పుడు బలంగా వున్నప్పుడు ప్రజలు ఎలా ప్రవర్తించాలో శాసనాలు చేసి వుండచ్చు. కానీ ఇప్పుడు వాళ్ళు ఇప్పుడు శక్తి హీనులు. ఆ శాసనాలను ప్రజలు అవలంబించేలా చెయ్యలేని స్థితిలో వున్నారు. ఇప్పుడు ఆ శాసనాలను

సైన్యం ద్వారా అమలు పరుస్తోంది ఆ శాసనాల ద్వారా లబ్ధి పొందుతున్న రాజ్యాధికారం. నువ్వు అనుకుంటున్నట్లు మన మొదటి శత్రువు మతాధికారి కాదు రాజ్యాధికారి – అంటే మహాధినేత." ముగించాడు మహాబసు.

వేదాంతం నెమ్మదిగా లేచి మహాబసు దగ్గరకు వెళ్ళాడు. అతని భుజం మీద చేతిని వేసి అభినందిస్తున్నట్లు చిన్నగా తట్టాడు. ఆ తరువాత ఉగ్ర వైపు చూసి చిన్నగా నవ్వాడు.

"ఉగ్ర నీ అనుచరగణానికి ఆజ్ఞలు జారీ చెయ్యి. ఏ మతాధికారిని చంపకూడదని వెంటనే ఉత్తర్వులు పంపించు..." అన్నాడు.

"మరి మన పోరాటం?" అడిగాడు ఉగ్ర.

"చెప్పానుగా మహాధినేతతో అని" మహాబసు సమాధానమిచ్చాడు.

"అదే ఎలా?"

"ధర్మం ఆధారంగా, అహింసాయుతంగా, సత్యమైన ఆగ్రహాన్ని చూపించాలి. రాజ్యమున్నవారికి సహాయం నిరాకరించాలి. అదంతా వివరంగా చెప్తాను పద" అంటూ లోపలికి నడిచాడు మహాబసు. అతని వెనుకే ఉగ్ర, దీప్వ, పశుపాల కదిలారు. ఆచార్య వేదాంతం చిరునవ్వు నవ్వుతూ వెనక్కి తిరిగాడు.

★★★

"అదీ డాక్టర్ జరిగింది" అన్నాడు సారధి.

"మీరు చెప్పిందంతా బాగుంది. ఇది మీ కలా, భ్రమా, లేక కల్పనా?" అన్నాడు పరీక్షిస్తూ.

"నాకేం అర్థం కావటం లేదు. మొన్న గోవా వెళ్ళి వచ్చినప్పటి నుంచి ఇలాగే వుంటోంది. నేను చెప్పిందంతా నిజం" అన్నాడు.

"మైట్ బీ ఏ హాలూజినేషన్ కేస్" అనుకున్నాడు సాలోచనగా. "మీ ఎదురుగా ఈ కథంతా జరిగినట్లు అనిపిస్తోందా?" అడిగాడు బయటికి.

"ఎదురుగా జరిగినట్లు కాదు డాక్టర్, నేను ఆ కథలోనే వునట్లుగా అనిపిస్తుంది. కల లాగే వుంటుంది కానీ స్పష్టంగా వుంటుంది. మొదటిసారి కలే అనుకున్నాను. కానీ రోజూ కొంచెం కొంచెంగా కథ నడవటం చూస్తుంటే ఇంకా ఆశ్చర్యమేసింది" అన్నాడు సారధి.

"సరే అలా బెడ్ మీద పడుకోండి. టెస్ట్ చేస్తాను" అన్నాడు.

సారధి బెడ్ మీద పడుకోగానే వచ్చి కాబిన్ తలుపు వేసేశాడు. దాని మీద అక్షరాలు మెరుస్తున్నాయి. "డాక్టర్ నరసింహం, సైక్రియాటిస్ట్."

★★★

**(జరగబోయే జగన్నాటకం వచ్చే మాసం)**

COMMENTS